కన్నబిడ్డలక్షేమం తప్పించి మరేమీ కోరదు తల్లి. పోషించి పెంచి పెద్ద చేసే శక్తి లేకపోవచ్చు కాని ప్రేమాభిమానాలకు కొరత ఉండదు. బిడ్డలు ఎక్కడో అక్కడ బ్రతికి బాగుంటే చాలునని తపిస్తుంది ఆ స్థితిలో.

# మమత

ఎ. ఎస్. సుబ్రహ్మణ్యం

నెల నిండిన పసిగుడ్డును తన పొలిండ్ల కదుముకుని, ముందు నడుస్తూంది రంగమ్మ. ఆమెను అనుసరిస్తూ భర్త నారాయణ నడుస్తున్నాడు.

"ఏంటో మామా! బిడ్డని ఒగ్గెయ్యటమంటే గుండె గుబగుబమంటా ఉంది మామా!" అంది రంగమ్మ విచారంగా.

"నాకుమాత్రం సంబరం అనుకొంటున్నావేటే ఇంటికే నలుగురు నలుసులు ఉండారే... ఈడి కూడా ఇంకెక్కణ్ణుంచి ఒత్తదే కూడు? నేను రిచ్చా నాగితే వచ్చిన డబ్బులు సాలక, ఇప్పటికే ఓపూట కూడు నేకుండానే పడుకొంటున్నాం రోజూను!" అన్నాడు నారాయణ, ఆమె వెనక నడుస్తూనే.

కొంతసేపు ఇద్దరూ మౌనంగానే నడిచారు. "సూడు మామా, ఎక్కడో పెద్దళ్ళ లోగిలి సూసి, ఆడ బిడ్డని ఒగ్గేద్దాం. ఏదైనా సుకంగా పెరిగితే సాలు."

"అట్టాగే!" నారాయణ పొడిగా అని ఊరుకున్నాడు.

"మామా! ఇప్పుడు గంట ఎంతేసిందంటావ్?"

"పదేసి కూసింత సేపైంది."

"ఈ సందే పోదాం. అక్కడ పెద్ద కొంప కనిపిస్తుంది. ఆ లోగిట్లో ఒగ్గేద్దాం!" అంది రంగమ్మ ఒక సందువైపు చూపించి.

నారాయణ మౌనంగా ఆమెను అనుసరించాడు. ఇద్దరూ ఒక మేడ దగ్గిరికి చేరుకున్నారు.

"కొంతసేపు ఈ అరుగుమీద కూకుని, ఒగ్గేసి పోదాం!" రహస్యం చెప్పినట్టుగా అంది రంగమ్మ, నారాయణ చెవిలో.

తల ఆడించాడు నారాయణ.

ఇద్దరూ మౌనంగా అయిదు నిమిషాలు కూర్చున్నారు. రంగమ్మ తన బిడ్డను జాగ్రత్తగా గుడ్డలో చుట్టి అరుగుమీద పరుండబెట్టింది. "ఇక పోదాం—రే!" మెల్లిగా అన్నాడు నారాయణ.

ఇద్దరూ లేచి రెండడుగులు ముందుకు వేశారు. వెనకనుంచి ఎవరో, "ఏయ్! ఇటు రండి" అని పిలిచారు. పిలిచినతడు ఆ ఇంటి గేటు కాపరి. ముందు ఇద్దరూ తమను కానట్టుగ వెళ్ళిపోబోయారు. అతడు మరి రెండు సార్లు గట్టిగా, "మిమ్మల్నే, ఇటు రండి" అని కేక వేసేసరికి, వెనుదిరిగి రాక తప్పలేదు.

"ఏంటి? అక్కడ ఏదో మూట వదిలేసి పోతున్నారు?" అని గద్దించాడతడు.

"మరిచిపోనాం బాబూ! పొరపాటైనాది!" అని పాపోతూ, రంగమ్మ గుడ్డలమధ్య చుట్టిన తన బిడ్డను ఎత్తుకొని, హృదయానికిహత్తుకుంటూ, "పద మామా!" అంది.

ఇద్దరూ అక్కడినుంచి కొంతదూరం వచ్చాక, "ఆ గేటు కాడాడు మన పాణానికి యములాళ్ళాగ ఒచ్చినాడు" అంది రంగమ్మ.

నారాయణ నిట్టూర్చి ఊరుకున్నాడు.

వారిద్దరూ అలా మౌనంగా కొంతదూరం నడిచాక, ఒక మేడ కనిపించింది. లోపల కింది భాగంలో ఎక్కడో ఒక దీపంమాత్రం వెలుగుతూంది. ఆ కిటికీ ఒక్కటీ తప్ప మిగతావన్నీ మూసి ఉన్నాయి.

రంగమ్మ వెళ్ళి, ఆ ఇంటి అరుగుమీద కూర్చుంది. ఆమె వెనకనే నారాయణ కూడా అక్కడే కూర్చున్నాడు.

"మన్ని ఎవ్వరూ సూట్టం లేదు. ఇక్కడ ఒగ్గేస్తే బాగుంటది!" అంది రంగమ్మ.

నారాయణ "ఊ!" అని ఊరుకున్నాడు.

కొంత సేపయిన తరవాత, వారిద్దరూ లేచి దాదాపు పది అడుగులు ముందుకు వేశారు. అంతలో గుడ్డల మధ్యనున్న పసిబిడ్డ కేర్ మన్నాడు. రంగమ్మకు అడుగు ముందుకు సాగలేదు. ఎవరో పట్టి బంధించి తనను ఈడ్చుకొని పోతున్నట్టుగా బాధ పడింది. ఆమె ఒక్క ఉదుటున వెళ్ళి బిడ్డ నందుకుని, పాలు కుడిపింది. అదే సమయంలో బిడ్డ ఏడ్పువిన్న ఇంటి యజమాని తలుపు తెరిచి, బయటికి వచ్చి చూచి, "ఏమిటీ గోల?" అని గద్దించాడు.

"ఏమీనేదు బాబూ! శానాదూరం పోవాల. కాళ్ళు నొచ్చినై. కొంతసేపు కూకుని పోతాం!" అంది రంగమ్మ కంగారు పడుతూ.

"ముందు బయటికి పొండి. అరుగుమీద కాస్సేపు కూర్చోవటం, సర్దు మణగగానే గోడదూకి చేతికందింది పట్టుకుపోవటం మీకలవాటు. ముందిక్కడనించి పొండి!" యజమాని గర్జించాడు.

రంగమ్మ ఏమీ మాట్లాడలేకపోయింది.

యజమాని మరోకసారి హెచ్చరించాక, ఇద్దరూ లేచి బిడ్డతో సహా అక్కడినుంచి బయలుదేరారు.

దారిలో రంగమ్మ అంది: "ఏటి మామా, లచ్చి ఇట్టా అపసకునాలైనాయి!"

నారాయణ పెదవి కదపలేదు.

ఇద్దరూ కొంత దూరం పోయాక, ఒక పెద్ద మేడ ముందర ఆగిఉన్న కారు కనిపించింది.

ఆ కారు చూచి, "మామా, బిడ్డని ఇందులో ఒగ్గేద్దాం!" అంది రంగమ్మ, లేని సంతోషం తెచ్చుకుంటూ.



ఐటెక్స్ కాటుక
ఐటెక్స్ బిందీ (తిలకం)
శాస్త్రీయంగా తయారుచేయబడినవి
అరవింద్ లేబరేటరీస్
పి. బి. నెం. 1415, మద్రాసు-17.

ఆరోగ్య అనారోగ్య పరిస్థితులలో మహిళలు ఆధారపడునది

లోధ్ర
ఆరోగ్య సౌభాగ్యములకు
65 సంవత్సరముల పైగా ప్రసిద్ధి నొందినది


కేసరి కుటీరం (ప్రైవేట్) లిమిటెడ్ రాయపేట, మద్రాసు-14
ఏజంట్లు:
సీతారామ జనరల్ స్టోర్సు (ఏజన్సీస్)
విజయవాడ . సికిందరాబాదు . మధుర . బరహంపురం . బెంగుళూరు

"అట్లాగే... నడు!" అన్నాడు నారాయణ.

ఇద్దరూ కారు సమీపించారు.

"తలుపు నొక్కి పట్టుకో మావా!" అంది రంగమ్మ.

అలాగే చేశాడు నారాయణ.

రంగమ్మ బిడ్డను గుడ్డలతో జాగ్రత్తగా చుట్టి కారు వెనుక సీటులో పడుకోబెడుతూంటే, "వేగిరం కానీ... ఎవరన్నా చూస్తారు" అని తొందరచేశాడు నారాయణ.

ఆమె బిడ్డను కారులో వదిలివేశాక అతడు ఆమె చెయ్యి పట్టుకొని, ముందుకు నడిచాడు వేగంగా బలవంతంగా అడుగులు వేసింది రంగమ్మ. ఇద్దరూ కలిసి ఆ సందు చివరివరకూ వచ్చారు. ఆ వీథిలో జన సంచారం లేదు. సందు మలుపు తిరగగానే, "నాకు గుండె దడగా ఉంది మావా!" అని అక్కడే ఒక గుమ్మం ముందు మెట్ల దగ్గిర కూర్చుండిపోయింది రంగమ్మ.

నారాయణ ఆమెను తొందరచేశాడు, వెంటనే వెళ్ళిపోవాలని.

రంగమ్మ ఉన్నట్టుండి ఏడవటం మొదలుపెట్టింది.

"ఏంటే ఇది? ఇప్పు డేడుస్తున్నావేంటి?" చిరాగ్గా ప్రశ్నించాడు నారాయణ.

"మావా! నా బిడ్డ! ఈ చేత్తో పాలు కుడిపేందుకు ఇక లేడు మావా!" అంది రంగమ్మ, చేతులను రొమ్ములకు బాదుకుంటూ.

నారాయణ ఒక్కక్షణం ప్రమాన్పడిపోయాడు. ఏమీ మాట్లాడలేకపోయాడు. ఆమె అక్కడనించి లేచి వెనక్కు బయలుదేరింది.

"బిడ్డను తీసుకు తెచ్చుకుందామా?" అతడు ప్రశ్నించాడు.

ఆమె ఏడుస్తూనే తల ఆడించింది.

"సరే, పా!" అత డామెను అనుసరించాడు.

ఇద్దరూ కారు దగ్గిరికి చేరుకున్నారు.

ఆమె కారు తలుపు మీద చెయ్యి వేసే సమయానికి ఇంటిలోనుంచి ఒక స్థూలకాయుడు బయటికి వచ్చి, "ఎవరక్కడ? ఏం చేస్తున్నారు?" అని గర్జించాడు.

"నీ కారు నెవడూ తీసుకోట ల్లేదయ్యా. నాది నే నట్టుకు పోతన్నాను!" అంది రంగమ్మ నిర్లక్ష్యంగా.

"ఏమ్! నా కారులో చేతులు పెడుతూ నీ వస్తువు అంటావేమిటి?" అతడు తీవ్రంగా అడిగాడు, రెండడుగులు ముందుకు వేసి.

అప్పటికే రంగమ్మ కారు తలుపు తీసి, తన బిడ్డను బయటికి తీసుకోబోతూంది. అతడి మాట విని, ఆమె చేస్తున్న పని ఆపుచేసి, "నీ కారు ఓరిక్కావాలయ్యా, ఎదవ కారు! నీ కారుమీద కాండ్రించి ఉస్తాను" అని ఆమె నిజంగానే కారు తలుపుమీద ఉమ్మి వేసింది.

వెంటనే కారులోనుంచి తన బిడ్డను తీసుకొని, "ఇదిగో చూడు, ఇది నా సొమ్ము. నా బిడ్డ" అంటూ తన చేతిలోని శిశువు ముఖాన గుడ్డ తొలగించింది. "చూడు... ఇంత సక్కటి బిడ్డను సూసి ఉండవెప్పుడూ! ఇంక ఆట్టే మాట్లాడినావంటే, పోలీసోయన్ని పిలిచి, నా బిడ్డ నెత్తుకెడుతుండవని సెబుతాను" అంది రంగమ్మ రోషంగా. తరవాత పక్కనే బొమ్మలా నిలబడిపోయిన నారాయణ చెయ్యి పట్టుకుని, "రా, మావా, పోదాం!" అని ముందుకు సాగిపోయింది. ★

